
Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed International Journal
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:6(5), June: 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

# అచ్చమైన దేశీ కవి అన్నవరం దేవేందర్

-డా॥ సంగి రమేష్
ప్రిన్సిపాల్
ప్రభుత్వ డిగ్రీ కళాశాల
మహేశ్వరం - రంగారెడ్డి జిల్లా

అన్నవరం దేవేందర్ కవిత్వం గురించి మాట్లాడుకోవాలంటే గత నాలుగు దశాబ్దాల తెలంగాణ, తెలుగు సామాజిక పరిణామాల గురించి మాట్లాడుకోవాలి. దేవేందర్‌ను మన కాలపు కాళోజీ అంటే అతిశయోక్తికాదు. సమాజంలో ఏర్పడే అనేక సంక్షోభాలను ఎప్పటికప్పుడు కవిత్వీకరించి కాలాన్ని అక్షరాల్లోకి తర్జుమా చేయడం దేవేందర్ కవిత్వంలో కనిపించే గొప్ప గుణం. కాళోజీలాగే దేవేందర్ కూడా చెప్పాలనుకున్న కవితను తెలంగాణ దేశీ భాషలో చెప్పడం, తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వాన్ని కవిత్వం నిండా ప్రాణంలాగా నింపడం గమనించవచ్చు. ఆయన మొదటి కవితా సంపుటి తొవ్వ నుండి నిన్న మొన్న వెలువడ్డ జీవన తాత్పర్యం దాకా ఈ దేశితనం పర్చుకుని ఉండడం ఆయన పాఠకులకు బాగా తెలుసు. దేవేందర్ ఇప్పటిదాకా 12 కవితా సంపుటాలు వెలువరించారు. వాటిలో 'పొక్కిలి వాకిళ్ల పులకరింత' కవితా సంపుటి చాలా భిన్నమైనది. ఎందుకంటే ఇందులో ఉన్న నలభై కవితల్లో ఇరవై కవితలు కేవలం ప్రత్యేక తెలంగాణ ఉద్యమ భావజాలంతో వచ్చినవే ఉన్నాయి. మిగతా ఇరవై కవితలు వస్తు వైవిధ్యంతో మిళమిళ మెరిసే కవితలు. ఈ కావ్యం ఎందుకు ప్రత్యేకమైందంటే ఒకప్పుడు పరాయి పాలనలో పొక్కిలి పొక్కిలి అయిపోయిన తెలంగాణ ప్రాంతం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం రావడంతో ఎలా పులకరించిపోయిందో తెలిపిన కావ్యంగా చదువరులకు గుర్తుండిపోతుంది.

ఈ కవితా సంపుటిలోని మొదటి కవితే ఎంతో వైవిధ్యమైంది. ఈ కవిత ఒక రకంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రానికి మేనిఫెస్టోలాంటిదని చెప్పవచ్చు. ఎలాంటి ప్రణాళికతో రాష్ట్రం ముందుకుపోవాలో వివరించిన కవిత.

> "సచివాలయం నిండ సొచ్చిన ఉడుములు
> ఎల్లిపోయి సచ్చమైన హంసలు కలె తిరుగాలె
> రెండున్నర జిల్లాల నోటిమాట పడిపోయి
> పదిజిల్లాల మాట దద్దరిల్లాలె
> ...............................
> ట్యాంక్‌బండ్ కాడ మిగిలున్నయి అనంత జరిపి
> ఆ జాగల ఈ నేల వైతాళికులు నిలుచుండాలె
> ...................................................
> ఆధిపత్య పెత్తనపు అంగి ఇడిశి పారేశి
> పెద్దంత్రం చిన్నంత్రం లేకుండ బతుకాలె
> మనది మనకైనంకల సమానంగ నిలిచి వెలుగాలె"

తెలంగాణ ఉద్యమానికి మూలబిందువులుగా నిలిచినవి నీళ్ళు, నిధులు, నియామకాలు. వీటితోపాటు తెలంగాణ భాషకు, యాసకు, తెలంగాణ వైతాళికులకు సరైన గుర్తింపునివ్వాలనేది తెలంగాణ ప్రజల చిరకాల పోరాటం. సహజ వనరుల తరలింపు ఆగాలని, పాఠ్యపుస్తకాల్లో మన ప్రాంతపు పోరాట వీరుల పాఠాలు పెట్టాలని, తెలంగాణలోని వివిధ వ్యాపార, ప్రభుత్వ కార్యాలయాల నామఫలకాల్లో ఉన్న ఆంధ్ర వాసనను పూర్తిగా తొలగించాలని, భూమి, ఇసుక దోపిడీని అడ్డుకోవాలని, అందరూ సమానమైన హోదాతో బతకాలని తెలంగాణ ప్రజల ఆకాంక్ష అంతా ఈ

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed International Journal
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:6(5), June: 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

కవితలో తొంగి చూస్తుంది. విశ్రాంతి వర్గాలకు కాదు, ఉత్పత్తి వర్గాలకు సరైన న్యాయం జరగాలని కవి చూపించిన వెలుగుదారి ఎప్పటికైనా శిరోధార్యమే.

“లోకాన సకల జనులు సమ్మెకట్టి
సాధించుకున్న తెలంగాణం
జైకొట్టుకుంట రానే వచ్చింది
...................................
విశ్వవిద్యాలయాలు అగ్గిరవ్వ రాజేయంగ
ఉద్యమించిన ఉగ్ర తెలంగాణం
ఉరుకురికి ఉషారుగ రానే వచ్చింది
.........................................
కవుల కలాలు గళాలు నోరు తెర్వంగ
కట్లు తెంపుకున్న తెలంగాణం
ధూంధాంగ రానే వచ్చింది”

ప్రత్యేక తెలంగాణ ఎంత సందోహంగా, సందడిగా వచ్చిందో వర్ణించిన కవిత ‘జయం’. రాష్ట్ర సాధన గారడివాని మొక్కలాగా అప్పుడే మొలకెత్తి, అప్పుడే పుష్పించి, అప్పుడే ఫలాలు ఇవ్వలేదు. దాని వెనక సముద్రమంత పోరు ఉంది. ఎన్నో పోరాట మార్గాలున్నాయి. ఎంతో మంది యువకుల, ఉద్యమకారుల ప్రాణ త్యాగం ఉందని కవి ఉద్యమ దశలనన్నీ ఏకరువు పెట్టిన కవిత. సకల జనుల సమ్మె, సబ్బండ వర్ణాల నిరసనలు, అక్క చెల్లెళ్ల బతుకమ్మ ఆటలు, యూనివర్సిటీ విద్యార్థుల ఉగ్ర పోరాటాలు, అన్ని జేఏసీల ఉమ్మడి పోరు, కవుల, కళాకారుల సాంస్కృతిక ఉద్యమం సమైక్యవాదుల కుట్రలను చిత్తుచేసిన నాయకుల ముందుచూపు, వంటావార్పు, ధర్నాలు.. ఇలా ఎన్నో రూపాల్లో జనం సుమారు దశాబ్దంన్నరపాటు చేసిన మలిదశ పోరాట స్వరూపం అంతా కళ్లకు కట్టినట్టు చూపెట్టిన కవిత. ‘ది బిల్ ఈజ్ పాస్డ్’, ‘మామిడాకుల దోర్నాలు’, ‘అల్కగ’ లాంటి కవితలు కూడా ఆ ఆనంద సన్నివేశాన్ని చిత్రించిన కవితలే.

రాష్ట్ర కల సాకారమైన సందర్భం దగ్గరి నుంచి మెల్లమెల్లగా అసలు ఉద్యమం ఎందుకు మొదలైంది. ఉద్యమం కొనసాగిన విధానం, రెండు ప్రాంతాల ప్రజల జీవనం మధ్య ఎంత తేడా ఉన్నది... ఇలా ఒక్కొక్క ఉద్యమ పొరను విప్పుకుంటూ తెలంగాణ ప్రజల ఆకాంక్షను కవిత్వీకరించిన తీరు ఉద్యమమంత వాడిగా, వేడిగా ఉంటుంది ఈ సంపుటిలో.

“నీది ఆంధ్రమాత
నాది తెలంగాణ తల్లి
తల్లులు వేరువేరైనప్పుడు
ఇండ్లు సుత వేరే
ఉంటయి గదనే నాయిన

నీది ఇంగ్లీష్ ఎంగిలి
నాది ఉర్దూ మరక
మన నాలికలల్ల ఇమిడి పోయినయి
మరి ఎవల తావుల వాల్లుంటేందన్న!
.........................................
అన్నిట్లా ఇద్దరం వేరు వేరే
అన్నదమ్ముల్లా కల్సిమెలిసి
ఆంధ్ర తెలంగాణ పటం గీసుకుందాం!
రెండు తెలుగులుగ జీవిద్దాం...!!”

ఆంధ్ర, తెలంగాణ మొదటి నుంచి రెండు ప్రత్యేక రాష్ట్రాలు. రెండు రాష్ట్రాల్లో మాట్లాడేది తెలుగే కదా! అనే ఒక సాకుతో 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు చేయడం, ఆ పొత్తు ఎలా వికటించిందో చెప్పిన అద్భుతమైన కవిత ఇది. రెండు రాష్ట్రాల ప్రజల సామాజిక, సాంస్కృతిక జీవితాలు వేరైనప్పుడు కలిసి ఉండడంలో అర్థం లేదనేది కవి వాదన. భౌగోళిక పరంగానే కాదు, సాహిత్యం, పండుగలు, ఆహారపు అలవాట్లు, వేష, భాషలు, స్వాతంత్ర్య దినాలు అన్నీ వేరే అయినపుడు కలిసి ఉండడంలో అర్థం లేదుగదా! ఇకనైనా ఆంధ్ర, తెలంగాణ అని రెండు వేరు వేరు పటాలు గీసుకుని కలిసిమెలిసి బతుకుదాం అని పిలుపునిస్తూనే అవతలి వారికి తెలంగాణ రాష్ట్ర కాంక్షను అర్థం చేయించడానికి ప్రయత్నించిన కవిత.

ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు రెండు దశల్లో పోరాటాలు చేశారు. ఎందుకింత అలుపెరుగని పోరాటాలు చేస్తున్నారనేది ప్రాంతేతరులకు అర్థం కాని విషయం. భుజం మార్చుకున్నారేమో కాని పోరాటాన్ని మార్చుకోలేదు. అందుకు కారణాన్ని తెలంగాణ కవులు, రచయితలు చాలా పాటల ద్వారా, కవితల ద్వారా, కథల ద్వారా విడమర్చి చెప్పారు.

“ఇక్కడి మన్ను సారంలనే
మర్లవడే జవజీవం లీనమైంది
ఈ నీళ్ల పారకంలనే
ఎదురెక్కే జిగిబిగి దాగున్నది
ఇత్తునం పుట్టుకే ఇంత
తిరుగబడే తిక్క మొలకలు
అడవి నిండా పెరిగిన చెట్ల కొమ్మలకు
ఆకులు కాదు, తుపాకుల ఇగురు”

తెలంగాణ అంటేనే పోరాటాల గడ్డ. ఇక్కడి ప్రజల రక్తంలోనే తిరుగబడే గుణం ఉన్నది. పిడికిళ్లు బిగించి ఉద్యమించే తెగువ ఉన్నది. చావుకు ఎదురెళ్లే తెగింపు ఉన్నది. స్వేచ్ఛ కోసం పెనుగులాడే ఫీనిక్స్ పక్షి జీవిత సారం ఉన్నది. అందుకే తెలంగాణ నేల మీద అనేక ఉద్యమాలు మొలిచాయి. సాయుధ రైతాంగ పోరాటం నుంచి నిన్నటి ప్రత్యేక తెలంగాణ పోరాటాల దాకా ఈ ఉద్యమ ప్రస్థానం కొనసాగుతూనే ఉన్నది.

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed International Journal
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:6(5), June: 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

Cover Page

తెలంగాణ స్వరాష్ట్రంగా ఏర్పడిన తరువాత ఆ రాష్ట్రాన్ని ఎవరి చేతుల్లో పెట్టాలో కవి మార్గదర్శనం చేస్తాడు. కాళోజీ ఒక కవితలో "ఓటిచ్చునప్పుడే ఉండాలి బుద్ధి/ఎన్నుకొని తలబాదుకొన్ననేమగును... ఓటు వేయుట పిల్లలాట యెట్లగును?... ప్రాణతుల్యము ప్రజాస్వామ్యమున ఓటు" అని అన్నట్లుగా పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఎటువంటి నాయకుడిని ఎన్నుకోవాలో, పాలనను ఎవరి చేతిలో పెట్టాలో ముందస్తుగానే హెచ్చరించారు కవి అన్నవరం దేవేందర్.

"ఆయన ఎవలైతేంది/వూరు పక్కన గుట్టలన్నీ
గులాబీజాంలా/గుటుక్కుమని మింగడు గదా!
జర జల్లెడ పట్టి సూడాలె/ఆయన ఎవలైతేంది
వూరు సుట్టు వాగులల్ల/ఇసుకనంతా దేవుకొని
పుట్నాల్లెక్క బుక్కడు గదా/ జర మెరిగెల్లెక్క ఏరాలె"

ఆయన ఎవలైతేంది. ఆయన కులం, గోత్రం, ఆస్తి, అంతస్తులతోని మనకు పనిలేదు. ఆయన గుణమే ప్రధానం. ఆయన బుద్ధి ఎటువంటిదో తెలుసుకోవడానికి జల్లెడ పట్టాలె. మెరిగెల్లెక్క ఏరాలె. జాలిల వడబోయాలె. పశనతు పట్టి చూడాలె. తేజాబ్‌ల కడుగాలె. అప్పుడే సొక్కం బంగారం బయట పడుతది అని ఓట్లను ఎవరికి వేసి గెలిపించాలో కవి చెప్పిన తీరు ప్రజాస్వామ్యానికి ప్రాణపథంలా నిలుస్తుంది.

ఈ 'పొక్కిలి వాకిళ్ల పులకరింత' కావ్యాన్ని రెండు భాగాలుగా అర్థం చేసుకోవచ్చు. ఒక భాగం ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కవిత్వమైతే, మరో భాగం సామాన్యుల జీవితాలను ప్రభావితం చేసిన అనేక పార్శ్వాలు. సాధారణ ప్రజల కన్నా కవుల హృదయం ఒకింత సున్నితమైంది. తొందరగా సెన్సిటైజ్ అయ్యే లక్షణం కలది. అందుకే కవులు ప్రతి వస్తువును, సందర్భాన్ని, సన్నివేశాన్ని, అనుభవాన్ని కవిత్వం చేసి ఒకడుగు ముందుంటారు.

"మనస్సు ఎప్పుడైనా
ఒరుసకపోయి నెత్తురు కారినపుడు
కవిత్వం రేకులు 'నల్లారం' ఆకులు దంచి
పసరు పూస్తా
గుండె ఎప్పుడైనా
వచ్చులు వచ్చులై ఇచ్చుకపోతే
కవితా పంక్తుల్లో జిందాతిలిస్మాత్ పోసి
మర్దన చేయమంటా"

కవి సహజంగానే నిత్యగాయాల నదిలాంటివాడు. శరీరమెప్పుడూ జ్వరమయం కావడం, గుండె ఎప్పుడూ అతలాకుతలం కావడం, అర్థరాత్రిదాకా నిద్ర పట్టకపోవడం, తిక్కతిక్క కోపం రావడం కవికి గల బలహీనత (బలం). అందుకే అయనకు 'కవిత్వమొక కిరణజన్య సంయోగ క్రియ'. అన్నవరం అచ్చంగా అలాంటి కవి. సెలవులకు అమ్మగారింటికి పోతేనో, మొదటిసారి విమానయానం చేస్తేనో, జీవవైరుధ్యం పెరిగిపోతేనో, అడవి అన్యాక్రాంతం అయితేనో, ఛార్‌ధాం యాత్ర 'విచార్‌ధాం'గా ముగిస్తేనో, దివ్యాంగులు జీవితాన్ని ఈడ్చుకొస్తేనో, బహుజనులు పిడికిళ్లు బిగిస్తేనో, పొద్దుపొద్దున్నే 'నడక'తో ప్రకృతిని పలకరిస్తేనో, ఢిల్లీలో 'నిర్భయ'ంగా

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed International Journal
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:6(5), June: 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

మృగాళ్లు రెచ్చిపోతేనో, కూతురు తల్లిగా మారిన క్షణాలో, రైతుల యూరియాలైను పెరిగిపోతేనో, వాళ్లుంటే సమాజం ఎంత ఆరోగ్యంగా ఉండేదో ఊహించుకుంటేనో కవి గుండె కవిత్వమై పరవళ్లు తొక్కుతుంది. ఆత్మగల్ల మనుషులు కాళోజీ, సామల సదాశివ, నలిమెల భాస్కర్, వేలుపిళ్లై ప్రభాకర్‌లాంటి వాళ్లతో పెనవేసుకున్న అనుబంధాలు, ఆత్మీయతలు కూడా దేవేందర్‌ను నిమ్మలంగా కూకుండ నీయవు.

“అయ్యేది కానిది, అయితే ఎట్లయితది
సంతకం అంతరంగం ఆయనకు ఎరుకే
ఆకుపచ్చ సిరా సర్వం ముందు
భయ వినయ దృశ్యం”

తిలక్ రాసిన ‘పోస్ట్‌మ్యాన్’ కవితను తలపించే కవిత ‘అటెండర్’. అటెండర్ అంటే తెల్ల అంగి, లాగు, ముఖం మీద తెల్లని నవ్వు అని అనుకుంటాం కాని, ఆయన వినయానికి, భయానికి నిలువెత్తు స్వరూపం. ఏ పని ఎట్లయితదో ఆయనకే ఎరుక. ఆఫీసుల అందరి మర్మాలు తెల్సినవాడు. అన్ని ఫైళ్లు ఏ దశలో ఉన్నాయో గుర్తెరిగినవాడు. ఆయన అన్నంలో బిర్యాని ఆకులాంటి వాడు. ఉంటే తీసి పారేస్తాం కాని లేకుంటే ఎళ్లది.

అన్నవరం దేవేందర్ నాలుగు దశాబ్దాలుగా నిబద్ధతో కవిత్వం రాస్తున్న కవి. తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వాన్ని నరనరాన జీర్ణించుకన్న కవి. వ్యాసం, కథ, కవిత, కాలమ్ ఏది రాసినా తెలంగాణ తెలుగులోనే రాయాలనే స్వీయ శపథం తీసుకున్న కవి. అందుకు ఈ ‘పొక్కిలి వాకిళ్ల పులకరింత’ కవితా సంపుటి ఒక అక్షరోదాహరణ.

పెచ్చులు పెచ్చులు, అసొంటి, దూప, అచ్చు, షెరీకు, కమాయించు, అంగి, వాగు, మెరిగెలు, జాలి, పశనతు, గంపగుత్త, సొక్కం, ఉరుకు, జల్లెడ, సోపతి, గిర్క, పుర్సతు, ఆపతి, సంపతి, అలిమి, బలిమి, ఎన్నుపూస, తాతిపరం, ఇర్వాటం, కచ్చురం, దుబ్బకాళ్లు, తోడ్క, పోత్రవుతు, దుబ్బతుత్తుర్లు, పల్లేరుగాయలు, శెల్క, ఏనె, ఎటమటం, తర్ర, సాదకం, దాణ, ఇషార, గచ్చులు, చిచోర, కల్లం, ఇడుపుకాయిదం, పాపెట, రాగోల, బోనం, నీల్గుడు, ముర్కసూసి, గడంచె, శాత్రం, గోరుకొయ్యలు, ఎగిలివారంగ, దోర్నాలు, పురుసాలు, ఇగురం, ఒరుసకపోయి, మోట, సడుగు, నల్లారం, దస్తకత్... ఇలా నిఘంటువులకు ఎక్కని కొన్ని వందల తెలంగాణ పదాలను గంపలకెత్తుకోవచ్చు అన్నవరం దేవేందర్ రాసిన ఈ సంపుటి నుండి.

ఈ కవితా సంపుటి ప్రత్యేకతలు మరో రెండు చెప్పుకోవచ్చు. ఒకటి ఈ కావ్యానికి ముందుమాట లేదు. దీని ద్వారా పాఠకులను నేరుగా తన కవితా సముద్రంలోకి దూకమని సూచించినట్లు అనిపిస్తుంది. రెండవది కవి భావాలకు అదనపు చేర్పుగా అన్నవరం శ్రీనివాస్ వేసిన అంతర చిత్రాలు. ఎంతో భావగర్భితం, మనోహరం. అన్నవరం దేవేందర్ కవితా శిల్పం గురించి ప్రత్యేకంగా మాట్లాడుకోవాలి. తెలంగాణ మట్టికి, ప్రకృతికి, భాషకు, జీవితానికి ఉన్న శిల్పం అంతా ఆయన కవిత్వంలో తొంగిచూస్తుంది.